క్లుప్తంగా

వైభవంగా శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు

నందిగామ: పట్టణంలోని నెహ్రూనగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేశారు. అనంతరం పలు రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నందిగామ: పట్టణంలోని మెయిన్ బజార్‌లో బుధవారం చలివేంద్రాన్ని అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు మహంకాళి వెంకన్న గురుస్వామి ఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పట్టణంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో దాతల సాయంతో మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. సేవా సంఘం ప్రతినిధులు ఊటుకూరు సత్యనారాయణ, కొప్పు నూకేశ్వరరావు,సూరెరాంబాబు,చిలకల వేణు, నరసింహారావు,సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా చూడాలి

కొణకంచి(వత్సవాయి): చిన్నారులకు వడదెబ్బ తగలకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఆయుర్వేద వైద్యాధికారిణి కె. వాణి సూచించారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు మండిపోతున్న తరుణంలో చిన్నారులను ఎండకు బయటకు వెళ్లకుండా చూసుకోవాలని తెలిపారు. వడదెబ్బ తగిలినట్లు అనుమానం వస్తే వెంటనే చల్లటి నీళ్లతో ఒళ్లు మొత్తం శుభ్రంగా తుడవాలన్నారు. కొబ్బరినీరు, మజ్జిగ, ఓఆర్‌ఎస్‌ను ఎక్కువగా తాగించాలని తెలిపారు. ఎక్కువగా నీరు ఉండే ఆహారాన్ని అందించాలని చెప్పారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరులపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం మండలంలోని అల్లూరు గ్రామంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని పార్టీ కార్యాలయంలోబుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం ఏడు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

25న ఉచిత వైద్యశిబిరం

మక్కపేట(వత్సవాయి) : పిన్నమనేని సిద్దార్థ కంటి వైద్యశాల, కొమరగిరి ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 25న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కేఆర్ భరద్వాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పా రు. పరీక్షలలో పాల్గొనే వారు విధిగా ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన

శనగపాడు(వత్సవాయి): ఉపాధి హామీ పథకంలోని పనులను ప్రాధాన్యతా క్రమంలో చేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు మార్కపూడి గాంధీ తెలిపారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు ముఖ్యంగా రైతులకు అవసరమైన డొంక రోడ్లు, పంటకాలువలు వంటి పనులు గుర్తించి వాటిని ముందుగా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కూలీల హాజరులోఎటువంటి అవకతవకలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీఏ శాంతి పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ శివార్లలో కబేలా రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ పై అధికారులు దాడులు చేశారు. ఈ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో స్థానికులు ఫిర్యాదు చేశారని, దీంతో ఈ విషయంపై పరిశీలనకు వచ్చినట్లు నందిగామ మైనింగ్ ఇన్‌స్పెక్టర్ శివపార్వతి తెలిపారు. అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రదేశంలో జేసీబీ మిషన్ ఉందని, దానిని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. తిరిగి గురువారం సర్వే ద్వారా స్థలాన్ని పరిశీలించనున్నట్లు వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కంచికచర్ల : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ అవగాహన కలిగి ఉండాలని ఫైర్ అధికారి కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద బుధవారం అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో తడిలేకుండా చూడాలన్నారు. వంట గదిలో గ్యాస్ లీకయితే ముందుగా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. వేసవికాలంలో పశుపోషకులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ కే మధురిమ, ఆరోగ్య సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండాలనేదే సీఎం సంకల్పం

- ఎమ్మెల్సీ అరుణకుమార్
- 13, 16 వార్డుల్లో 'జగనన్నే మా భవిష్యత్తు'



పట్టణంలోని 13వ వార్డులో ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



ప్రజలకు పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు గృహసారథులు

నందిగామ టౌన్: ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండాలనేదే సీఎం జగన్ సంకల్పమని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 13, 16 వార్డుల్లో చేపడుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు' 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ముందుగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లతో కలిసి వార్డుల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పని తీరును సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం గృహయజమాని అనుమతితో ఇంటి గోడలకు, ఫోన్‌లకు స్టిక్కర్‌లు అంటించి ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలకు ప్రజల నుంచి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గత ప్రభుత్వాలకు భిన్నంగా పారదర్శక జవాబుదారీ పాలన సాగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. గతంలో ఏ ప్రజా ప్రతినిధి ఎన్నికల సమయంలో మినహా ప్రజలకు పెద్దగా కనిపంచే వారు కాదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆ విధానానికి స్వస్తి పలికి ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలతో ఉండేలా కార్యక్రమాలు చేపట్టటమే కాకుండా మీకు ఇది చేశాం.. మీరు సంతృప్తి చెందితేనే మద్దతు పలకండి అని చెప్పటం సరికొత్త రాజకీయాలకు నాంది పలికారని కొనియాడారు. కౌన్సిల్ సభ్యులు గద్దె శేషుకుమారి, అచ్చి దివ్య, వార్డు ఇన్‌చార్జ్‌లు గద్దె రమేష్, అచ్చి శ్రీకర్, నాయకులు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, చల్లా బ్రహ్మేశ్వరరావు, మన్నం దాసు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, ఓర్సు జ్వాలా, వైఎస్ఎన్ ప్రసాద్, వీసం దుర్గారావు, మారం అమరయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కంచికచర్ల : స్థానిక వసంతకాలనీ, ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్, అరుంధతీ నగర్‌లతో పాటు పలు కాలనీలలో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబుల ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పెండ్యాలలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, గండేపల్లిలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి సర్పంచి బొక్కా రవికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. మండలంలోని పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనంద జ్యోత్స్న, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, మోగులూరులో సొసైటీ అధ్యక్షుడు బండి జానకిరామయ్య, వైఎస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, ఎస్ అమరవరంలో సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, సర్పంచి కోదాటి సీతారాం, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మీలు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజా రమణి, మాడుగుల మధుబాబు, పాపట్ల సీత, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

అనిగిండ్లపాడు(వత్సవాయి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పెనుగంజిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి జగనన్న ప్రభుత్వంలో వస్తున్న సంక్షేమ కార్యక్రమాల పనితీరు గురించి వివరించారు. గతంలో పథకాలు వచ్చిన పరిస్థితి ప్రస్తుతం పథకాలు నేరుగా లబ్ధిదారుని ఖాతాల్లోకి వస్తున్న పరిస్థితిని గురించి వివరించారు. ప్రజలందరూ ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి జ్యోతిబ్రహ్మం, మైనింగ్, పూసల సంఘం డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, సచివాలయ కన్వీనర్ కన్నమూల శామ్యూల్, గ్రామ పార్టీ అధ్యక్షులు జి ప్రసాద్, నాయకులు కొత్తపల్లి పెంటయ్య, దోసపాటి దానయ్య, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ విజయమ్మ జన్మదిన వేడుకలు



నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ విజయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి వైఎస్ విజయమ్మ కృషి మరువలేనిదని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వైఎస్ విజయమ్మ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విజయమ్మ జన్మదిన కేక్‌ను మహిళలతో కలిసి ఆయన కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ ఓర్సు లక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కృష్ణ, తానూరి రాము, విశ్వనాథపల్లి వాణి, మారం అమరయ్య, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, బండారు వెంకట్రావ్, షేక్ ఫాతిమా, గద్దె రమేష్, రాచూరి సీతారాం, విశ్వనాథపల్లి కృపారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా నిలిచేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్
- రూ.5 లక్షల సొంత ఖర్చుతో ఈద్గా నిర్మాణం
- ప్రారంభించిన ఎమ్మెల్సీ అరుణకుమార్
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సత్కరించిన ముస్లింలు



చందర్లపాడులో ఈద్గాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



ఎమ్మెల్యే జగన్‌మోహనరావును సత్కరిస్తున్న ముస్లింలు, నాయకులు

నందిగామ టౌన్: ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రకాలుగా ముస్లింలకు ఎల్లవేళలా అండగా నిలిచేది వైఎస్సార్ సీపీ మాత్రమేనని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. చందర్లపాడులో నూతనంగా నిర్మించిన ఈద్గాను మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఈద్గాను ప్రాంభించటం సంతోషంగా ఉందన్నారు. తాను, శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు రూ.5 లక్షల సొంత నిధులతో ఈద్గాను నిర్మించామని తెలిపారు. ఈద్గా లేకపోవటంతో నమాజ్ చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని మూడు నెలల క్రితం చందర్లపాడుకు చెందిన ముస్లింలు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. దీంతో అల్లాహ్ దయతో ఈద్గాను నిర్మించామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించారని పేర్కొన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్, ఎంపీపీ, కౌన్సిలర్‌లుగా, కార్పొరేషన్ డైరెక్టర్‌లుగా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులుగా పలు కీలక పదవులను ముస్లింలకు కేటాయించామని తెలిపారు. ముస్లింలు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు.

ఇఫ్తార్ విందు ప్రారంభించిన ఎమ్మెల్యే..

చందర్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ లాల్‌సా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక నమాజ్ చేశారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఘన సత్కారం..

ఈద్గా నిర్మించిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లను ముస్లింలు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ కస్తాల పున్నమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్‌లు కందుల నాగేశ్వరరావు, ఆవుల రమేష్‌బాబు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, రాయల జానకిరామయ్య, బుగ్గినేని సురేష్, లాల్‌సా, షీకుర్, నాయకులు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

సీఎం సహకారంతో 100 పడకల ఆస్పత్రి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



ప్రసూతి వార్డులో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామకు 100 పడకల ఆస్పత్రి మంజూరైందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ ప్రజల ఏళ్లనాటి 100 పడకల ఆస్పత్రి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు, 100 పడకల ఆస్పత్రి ఆవశ్యకతను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వివరించగా వెంటనే స్పందించిన ఆయన ఆస్పత్రిని మంజూరు చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు చురుకుగా జరుగుతున్నాయని తాజాగా నిధుల మంజూరుకు ఆర్థిక శాఖకు ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం..

ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యాధికారులు, సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని ప్రసూతి వార్డును పరిశీలించి వైద్య సేవల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, సూపరింటెండెంట్ సీతారావమ్మ, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్ యూనిట్ ప్రారంభం



మినీ ఫిష్ అవుట్‌లెట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: ఫిష్ ఆంధ్రతో ఇంటి ముంగిటకే మత్స్య ఉత్పత్తులు వస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని కోదాడ రోడ్డులో, తొర్రకుంటపాలెంలో ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్ యూనిట్‌లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్య పరిశ్రమను ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫిష్ ఆంధ్ర హబ్‌లను ఏర్పాటు చేసి వినియోగదారుల ముంగిటకే చేపలు, రొయ్యలు అందిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళా లబ్ధిదారులకు 60 శాతం రాయితీ, ఇతర వర్గాల్లోని నిరుద్యోగ యువతకు 40 శాతం రాయితీ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఫిష్ ఆంధ్ర పేరుతో ఆక్వా హబ్‌లను వాటికి అనుసంధానంగా రిటైల్ అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. జిల్లాలో 196 మినీ ఫిష్ వెడ్డింగ్ యూనిట్‌లను కేటాయించగా నియోజకవర్గానికి 11 మంజూరయ్యాయని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా వాహనాలను అందజేస్తున్నట్టు చెప్పారు. యూనిట్ నిర్వాహకులు నడుకుదురు నాగరాజు, కరిశ మధులను ఆయన అభినందించి నిబంధనల మేరకు విక్రయించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జగ్గయ్యపేట మత్స్య శాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ శ్యాంలెనిన్ బాబు, సిబ్బంది రంగారావు, బాలగోపీనాథ్, రామకృష్ణ, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, నాయకులు తన్నీరు నాగేంద్ర, కిషోర్, బాలసైదా, రమేష్, కాజా, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధికి సీఎం కృషి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- పొక్కునూరు, పోపూరులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను గడప గడపకు అందిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని పొక్కునూరు, పోపూరు గ్రామాల్లో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి పథకాల క్యాలెండర్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కొమ్మినేని మహేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కటుకూరి ముసలయ్య, నాయకులు వేల్పుల స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక స్వచ్ఛంద సంస్థ ఆశా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పేద ముస్లిం మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యాలయంలో 100 మంది మహిళలకు చీరలు, ఫిత్రా (రూ.100) ఇచ్చి వాటితో పాటు కర్జూరాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు లయన్ ఖాసీం సైదా, అధ్యక్షుడు నజీర్ మీరా, కార్యదర్శి జిలానీ, కోశాధికారి ఈనిషా బేగం, సభ్యులు కరీమా, సోహెల్, యాశల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆశీలు వసూళ్లకు బహిరంగ వేలం

నందిగామ: పట్టణ పరిధిలో ఆశీలు వసూళ్లకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి పట్టణంలోని పలు వ్యాపార కూడళ్లలో ఆశీలు వసూలు హక్కులు దక్కించుకునేందుకు కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. గెజిట్ నోటిఫికేషన్ షరతులకు లోబడి పాల్గొనాలని ఆయన తెలిపారు.

బీజేపీకి వ్యతిరేకంగా ప్రచార భేరి



ప్రచార భేరి కార్యక్రమంలో సీపీఎం నాయకులు

నందిగామ: మతోన్మాద బీజేపీని సాగ నంపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చనుమోలు సైదులు అన్నారు. ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంచుతూ బీజేపీ వ్యవహారిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజెప్పారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ గొంతెత్తి నిలదీయాల్సిన సమయం ఆసన్నమైదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోపాల్, సయ్యద్ ఖాసిం, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి బాధలు తెలుసుకోవటమే ఇస్లాం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: పేదల ఆకలి బాధలు తెలుసుకోవటమే ఇస్లాం ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని ఉక్కు కళావేదికలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ హాఫిజున్నిసా ఫిరోజ్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పఠాన్ అక్బర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జామియా మసీదులో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రంజాన్ పండుగ త్యాగ నిరతికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముస్లింలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. రంజాన్ పవిత్ర మాసంలో తమ వంతుగా తోటి వారికి తోడ్పాటునందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి జుబేర్, దర్గా కమిటీ చైర్మన్ షేక్ ఖాజా, పలు వార్డు కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలోని 7,12వ వార్డు సచివాలయాలను జిల్లా గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి జి.రాజు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వేలో కొంత వెనుకబడి ఉన్నారన్నారు. సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కమిషనర్ మల్లేశ్వరరావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేతో కచ్చితమైన కొలతలు

కంచికచర్ల: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టి అనతికాలంలో ఖచ్చితమైన కొలతలు, హద్దులతో హద్దు రాళ్లను ఏర్పాటు చేయిస్తున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. మండలంలోని పరిటాలలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. రైతులు కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. మండలంలోని పేరకలపాడు, గండేపల్లి, కీసర, పెండ్యాల గ్రామాల్లో భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టామని, సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ కోరారు. డీటీ నాగుల్‌మీరా, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్, సర్వేయర్ బసవరావు, రైతులు పాల్గొన్నారు.

ముచ్చింతాల(వత్సవాయి): జగనన్న భూ రక్ష, భూ రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం సర్పంచ్ జక్కలూరి రాంబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో భూవివాదాలు లేకుండా ఉండేందుకు తీసుకున్న చర్యల్లోభాగంగానే రీసర్వేలు జరుగుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి టీ వీరభద్రరరావు, వీఆర్వో వెంకటమ్మ, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యం

నందిగామ: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటామని డీసీపీ వేజెండ్ల అజిత అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె బుధవారం నందిగామ పట్టణానికి వచ్చారు. ముందుగా ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ తర్వాత పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించిన అనంతరం డీసీపీ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవని, ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలో క్రైమ్ రేట్, తదితర అంశాలపై ఏసీపీ నాగేశ్వరరెడ్డితో చర్చించారు. ఎస్‌హెచ్‌ఓ సతీష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com